సాక్షి ప్రకాశం

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



రుణమాఫీ ఘన జగనన్నదే

డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.

- 8లో..



చకచకా రోడ్డు విస్తరణ

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో కొత్తపట్నంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అమూల్యమైన జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కె.శ్యాంబాబు

ఒంగోలు: క్షణికావేశంలో తప్పులు చేసి అమూల్యమైన జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా జైలును సందర్శించి ఖైదీలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కలిగించారు. జైలులోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి సూచనల మేరకు ఖైదీల్లో 18 ఏళ్లలోపు వారు ఎవరైనా ఉన్నారా అనేది ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి అవకాశం

ఒంగోలు: నిరుద్యోగ యువతీ యువకులకు కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ వద్ద ఉన్న నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిలర్/ కోఆర్డినేటర్ కోర్సులో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కీట్స్ ట్రస్టు కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత లేదా పీజీ పాస్/ఫెయిల్ అయిన వారు, 19 నుంచి 30 ఏళ్ల వరకు వయస్సు ఉన్న వారు అర్హులు. 60 రోజులపాటు నందిగామలో ఉచిత భోజనం, ఉచిత వసతి సౌకర్యం కల్పించి ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 9000487423 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బ్యాచ్ ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్రిపురాంతకంలో మంత్రి కారుమూరి పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త సునీల్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చిన నాగేశ్వరరావుకు ఆలయాల ఈఓ చెన్న కేశవరెడ్డి, పండితులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రిలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేక చండీ హోమం చేశారు. వీరిని కలిసిన వారిలో వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్, జెడ్పీటీసీ జాన్‌పాల్, సచివాలయ కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, యూత్ కన్వీనర్ ఆళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు ఐవీ సుబ్బారావు, మల్లికార్జున్, పీ వెంకటేశ్వర్లు, జీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్పందన తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరింది.

ఆర్టీసీ బస్సులు ఢీ



సంఘటన స్థలంలో ఆర్టీసీ బస్సులు

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి ఘాట్ రోడ్డులో రెండు ఆర్టీసీ బస్సులు ఆదివారం ఉదయం ఢీకొన్నాయి. గిద్దలూరు డిపోకు చెందిన బస్సు ఒంగోలు వెళ్తున్న క్రమంలో అదే డిపోకు చెందిన మరో బస్సు ఒంగోలు నుంచి గిద్దలూరు తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు బస్సుల అద్దాలు ధ్వంసమయ్యాయి. మోటుగ్రామం సమీపంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన చిన్నారి అన్వితకు స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

ప్రస్తుతం అతి తక్కువ ఖర్చుతో స్వల్ప కాలంలో అధిక దిగుబడులు ఇచ్చే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. సాధారణ పంటల వలన ఆశించిన ప్రగతి కనిపించకపోవడంతో రైతులు వాణిజ్య పంటలు సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో అధిక మండలాల్లో మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ సాగు 2962 ఎకరాలు ఉండగా 9212 ఎకరాలు సాగు చేశారు. అదే విధంగా రబీలో సాధారణ సాగు 12,740 ఎకరాలుండగా 14,072 ఎకరాలు సాగు చేశారు. జిల్లాలో మొత్తం మీద 21,952 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది.

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- మార్కెట్‌లో మంచి గిరాకీ.. ఆసక్తి చూపిస్తున్న రైతులు
- మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 21,952 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.50 వేల వరకు మిగులుదల



మొక్కజొన్నను కోత కోస్తున్న మిషన్



రైతులకు జాగ్రత్తలు చెబుతున్న వ్యవసాయ అధికారులు

ఒంగోలు సెంట్రల్: మొక్కజొన్న పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పాటు పంటకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీరే అవసరం కావటంతో ఈ పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న అనేక రకాలుగా విక్రయించే అవకాశం ఉండడం అత్యంత సానుకూల అంశం. ప్రధానంగా వీటిని పొట్ట రూపంలో చిల్లర మార్కెట్‌లో విక్రయించి లాభాలు ఆర్జించవచ్చు. పొట్ట నుంచి విత్తనాలు వేరు చేసి పశువులు, చేపలు, కోళ్లకు ఫీడింగ్ కోసం సైతం వినియోగించుకోవచ్చు. అలాగే వీటి పౌడర్‌ను పలు రకాల వంటకాల్లో వినియోగించవచ్చు. ఈ విధంగా లాభాలు అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో అధికంగా సాగు చేస్తున్నారు.

మంచి దిగుబడి:
మొక్కజొన్న ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు వస్తుండటం, మార్కెట్ ధర కూడా బాగా ఉండటం రైతులకు కలిసి వచ్చింది. క్వింటా రూ.2,350 నుంచి రూ.2500 వరకు పలుకుతోంది. ఎకరాకు సరాసరి 33 బస్తాలు వచ్చినా సరే ఎకరాకు రూ.75,250 వస్తుంది. రూ.25 వేలు పెట్టుబడిపోను రూ.50,250 వరకు మిగులుదల ఉంటుండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా మొక్కజొన్న సాగువైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వం దన్ను...
రెండేళ్ల క్రితం బహిరంగం మార్కెట్‌లో మొక్కజొన్న ధర తక్కువగా ఉండటంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొంది. దీని వలన రైతులకు ఎకరానికి రూ.10 నుంచి రూ.15 వేల వరకు అదనపు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.2090 ప్రకటించింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర కన్నా మార్కెట్‌లో అధికంగా ఉంది. దీంతో రైతులు పంట చేతికి వచ్చే వరకు ఇలాగే ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాగే కొనసాగితే మరింత పెరిగే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

పెట్టుబడి ఖర్చు తక్కువ



వరి, పత్తి, మిరప, ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువ. మిగిలిన పంటలు కొంత మేర కొనుగోలు కష్టంగా ఉన్నా సరే మొక్కజొన్న డిమాండ్‌గా అమ్ముడుపోతుంది. రెండేళ్ల నుంచి అధికంగా మొక్కజొన్న సాగు చేస్తున్నాం. కళ్లాల వద్దే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మూడు ఎకరాలు సాగు చేశాను. మంచి దిగుబడి ఉంది. వర్షాల సమయంలో కొంత నేలకు ఒరిగి దిగుబడులు కొంత మేర తగ్గాయి.

– కే రామిరెడ్డి, కొత్తపాలెం

ఆర్థికంగా ప్రయోజనం



మిగిలిన పంటల కంటే వాణిజ్య పంట పండించిన రైతుల పరిస్థితులు బాగున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఇచ్చిన సూచనల ప్రకారం సాగు చేస్తే మొక్కజొన్న వలన ఆర్థిక ప్రయోజనం ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉంది. ఈ సంవత్సరం కొంత వర్షాభావం వెంటాడింది.

– ఎస్ సిద్దయ్య, రైతు, శివరామపురం

మొక్కజొన్న శుద్ధి చేయటంలో జాగ్రత్తలు తీసుకోవాలి



కోత తర్వాత రెండు మూడు రోజులు ఎండలో ఆరబెట్టి గోనె సంచుల్లో భద్రపరచుకోవాలి. తేమ లేని ప్రాంతాల్లో శుభ్రం చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన దాని కంటే బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్వింటా రూ.2350 నుంచి రూ.2500 వరకు అమ్ముడుపోతున్నాయి.

– బి.ప్రసాదరావు, వ్యవసాయాధికారి,

వాణిజ్య పంటలే మంచిది



మొక్కజొన్న సాగుపై రైతులు గత రెండేళ్లుగా ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల వలన విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకొని కొత్త పైర్ల వైపు యువ రైతులు మొగ్గు చూపుతున్నారు. నూతన పోకడల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

విశ్వసనీయతకు నిదర్శనం సీఎం జగన్

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
- పొన్నలూరులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- కొండపి నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు రూ.200 కోట్లు జమ



పొన్నలూరులో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్

పొన్నలూరు: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తి స్థాయిలో అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు నిదర్శనంగా నిలిచారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పొన్నలూరులో ఆదివారం వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కులను డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా చంద్రబాబు డ్వాక్రా అక్కచెల్లమ్మలను నమ్మించి మోసం చేశాడన్నారు. ఇటువంటి తరుణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేసి నాలుగు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.25 వేల కోట్లను డ్వాక్రా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకు జమ చేసి వారి మోముంలో సంతోషం నింపారన్నారు. కొండపి నియోజకవర్గంలోని ఆరు వేల డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో రూ.200 కోట్లను వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయగా, పొన్నలూరు మండలంలో రూ.835 డ్వాక్రా గ్రూపులకు రూ.29.60 కోట్లును జమ చేశారన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్...
ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే అందజేసి సీఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి కలిగిన మహిళలకు రాయితీ రుణాలు అందజేసి మహిళా మార్టులు, చిన్న చిన్న కంపెనీల నిర్మాణానికి ప్రోత్సాహాలు అందజేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలతో పాటు 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేసి మహిళలకు పెద్దపీట వేశారన్నారు.

చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారెంటీ లేదు:
ఇదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేల కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడి జైలు జీవితం గడిపిన చంద్రబాబు భవిష్యత్‌కే సరైన గ్యారెంటీ లేదన్నారు. అలాంటి చంద్రబాబు మరోసారి మాయమాటలు చెబుతూ ప్రజల భవిష్యత్‌కు నేను గ్యారెంటీ అంటూ మభ్యపెడుతున్నాడని మంత్రి సురేష్ ఎద్దేవా చేశారు.

పేదరికం నిర్మూలనపై జగనన్న పోరాటం:
రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పోరాడుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీల ద్వారా పెత్తందారి వ్యవస్థను తీసుకొచ్చి ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా ప్రజలను పేదలుగా మార్చారన్నారు. పేదరికాన్ని రూపుమాపడానికే సీఎం జగన్ రూ.2.80 లక్షల కోట్లను ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా డీబీటీ పద్ధతిలో అవినీతికి తావులేకుండా పథకాల రూపంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 124 సార్లు బటన్ నొక్కి వారి ఖాతాలకు నగదు జమచేశారని, వచ్చే ఎన్నికల్లో రెండు సార్లు బటన్ నొక్కి మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధరాదేవి, ఏరియా కోఆర్డినేటర్ సనిత, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి పెరుగు కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి నారప రెడ్డి మహేష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నవులూరి మధు, వైస్ ఎంపీపీ అనుమోలు శివయ్య, ఏపీఎం సురేష్, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కంచర్ల రవణయ్య, దాసరి రవి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, మన్నెం రవణయ్య, ముళ్ళమూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నాయకులతో పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

గ్రామ స్వరాజ్యం సాకారం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



బసవన్నపాలెంలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో సాకారమవుతోందని సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని బసవన్నపాలెం, నాగన్నపాలెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆయన పరిచయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బసవన్నపాలెంలో ఆయన ఆర్‌బీకే భవనాన్ని, విలేజ్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 14 శాఖలకు చెందిన సిబ్బందిని గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచారని, ప్రతి పని గ్రామం దాటి వెళ్లకుండా జరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే వస్తారని అన్నారు. పార్టీ, కుల, మత తారతమ్యాలు లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించారని చెప్పారు. టీడీపీలోని వారికే ఎక్కువ పథకాలు అందాయని, ఇది జగన్ పరిపాలన విధానం అన్నారు. ఎన్నికల వరకే పార్టీలు పని చేస్తాయని తరువాత రాష్ట్ర ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రికి ఉంటుందని, ఇదే విధానానికి కట్టుబడి పని చేస్తున్నారని అన్నారు. మీకు మేలు జరిగితేనే ఓటు వేయండంటున్న ముఖ్యమంత్రిని ఎప్పుడైనా, ఎక్కడైనా చూశారా అంటూ ప్రశ్నించారు. టీడీపీలో ఉన్న కార్యకర్తలు ఎవరైనా అర్హత ఉండి పథకాలు రాకుండా ఆగిపోయాయా అంటూ ప్రశ్నించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గత ఎన్నికల్లో టీడీపీకి 23 సీట్లు మాత్రమే ఇచ్చిన ప్రజలు ఈసారి ఆ పార్టీని చాపచుట్టి బంగాళాఖాతంలో విసిరేస్తారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దోచుకోవడం దాచుకోవడంతోనే సరిపోయిందని అందుకే ఇప్పుడు తండ్రీ కొడుకులు అనుభవిస్తున్నారని అన్నారు. ప్రజలు తెలివిగా ఆలోచించి ఓటు వేయాల్సిన సమయం ఆసన్నమౌతుందని అన్నారు. ఎవరు ప్రజలకు మేలు చేశారో, చేస్తారో ప్రజలు గమనించాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి సంతనూతలపాడుకు ఇన్‌చార్జిగా వేశారని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి మేరుగు నాగార్జునను భారీ మెజారిటీతో గెలిపించి సంతనూతలపాడు నియోజకవర్గంలో తిరిగి వైఎస్ ఆర్ సీపీ జెండా ఎగురవేద్దామని, మళ్లీ మంత్రిగా చేసుకుందామని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ వ్యక్తి వికాసమే అభివృద్ధి అని గట్టిగా నమ్మిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి మేరుగు నాగార్జునను గెలిపించుకుని ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, నాగులుప్పలపాడు మండల పార్టీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఓబుల రెడ్డి, మద్దిపాడు మండల పార్టీ నాయకులు రామాంజనేయులు, శ్రీకాంత్, మద్దా లక్ష్మీనారాయణ సన్నపు రెడ్డి రమణమ్మ, జయమ్మ, మస్తానమ్మ, పూనాటి చిన్న అప్పయ్య, గ్రామ సర్పంచ్ రావి అరుణ, ఎంపీటీసీ రెబ్బవరపు ప్రమీల, జిల్లా విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు రవీంద్ర, నల్లూరి రాంబాబు మండవ శ్రీరామమూర్తి, హరిశ్చంద్ర ప్రసాద్, కోవి శ్రీనివాసరావు రవిబాబు పూర్ణ, వెంకట్రావు, నాగన్నపాలెంలో ఎంపీటీసీ సభ్యుడు పైనం ప్రభాకర్, శ్రీనివాసరావు, శ్రీరామమూర్తి, పలువురు పార్టీ నాయకులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర హాకీ జట్టు



బాలికల హాకీ జట్టు

హాకీ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక

ఒంగోలు: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా సబ్ జూనియర్ హాకీ బాలబాలికల జట్ల ఎంపిక ఆదివారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యదర్శి సుందరరామిరెడ్డి, సభ్యులు ఎస్.చంద్రశేఖర్, టి.రవికుమార్, పి.రవి, వై.మాధవరావులు పర్యవేక్షించారు. ఎంపికైన జట్లు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి సుందరరామిరెడ్డి వివరించారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయటమే లక్ష్యం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు

సింగరాయకొండ (టంగుటూరు): కొండపి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయటమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మినీ బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు క్యాంపు కార్యాలయం ప్రారంభించానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఇకపై కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు. అంతకుముందు మంత్రి సురేష్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి క్యాంపు కార్యాలయం ప్రారంభించారు. తరువాత క్రైస్తవులు, ముస్లింలు, హిందువుల మత పెద్దల ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు, పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పలువురు పుష్పగుచ్ఛం అందజేసి మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం, సోమిదేవిపల్లె మధ్యలో రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. 45-50 ఏళ్ల వయసున్న మగ వ్యక్తి మృతదేహంగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితం రైలు నుంచి జారిపడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లి గుర్తు పట్టలేని విధంగా మారింది. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు రైల్వే ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

మార్కాపురం: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మార్కాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడపాడు రోడ్డులో ఈశ్వరమ్మ టెంపుల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి వెలుగు చూసింది. పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపిన ప్రకారం.. మృతుని తలపై గాయాలున్నాయి. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. కనిగిరికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై రెహమాను పరిశీలించారు.

చకచకా రోడ్డు విస్తరణ

- కొత్తపట్నంలోని ఏఎంసీ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు శరవేగంగా పనులు
- రూ.2.75 కోట్లతో 3 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం
- ప్రతిరోజూ 10 వేల నుంచి 15 వేల మంది వరకూ ప్రయాణం
- ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బీచ్‌కు వచ్చేవారికి సౌకర్యం
- ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేనికి ప్రజల కృతజ్ఞతలు


రోడ్డు విస్తరణ కోసం తొలగిస్తున్న ఆక్రమణలు


రోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు గురించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి (ఫైల్ ఫొటో)


పల్లెపాలెం వద్ద ఒకవైపు పూర్తయిన సిమెంటు రోడ్డు

కొత్తపట్నం: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో కొత్తపట్నంలో ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత 20 రోజుల క్రితం ప్రారంభమైన రోడ్డు పనులు ఎటువంటి ఆటంకం లేకుండా సాగుతున్నాయి. రోడ్డుకు రెండువైపులా మార్జిన్ల ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వారివారి కట్టడాలు, బంకులు, బల్లలు, బిల్డింగ్‌లు, షట్టర్లన్నింటినీ తొలగిస్తున్నారు. తొలగించిన చోట రోడ్డు విశాలంగా ఉండటం వలన ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టడంపై ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కొత్తపట్నంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు 3 కిలోమీటర్ల పొడవున రోడ్డును విస్తరించి నిర్మించేందుకు ఆర్అండ్‌బీ ద్వారా రూ.2.75 కోట్ల నిధులను ఎమ్మెల్యే బాలినేని మంజూరు చేయించారు. ఏఎంసీ నుంచి బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు తారు రోడ్డు, అక్కడి నుంచి ఎస్సీకాలనీ వరకు సిమెంటు రోడ్డు, అక్కడి నుంచి బీచ్ వరకు సిమెంటు రోడ్డును విస్తరించి నిర్మిస్తున్నారు. ఇప్పటికే కె.పల్లెపాలెం వద్ద ఒకవైపు సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రెండో వైపు పనులు జరుగుతున్నాయి. సిమెంటు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్, డ్రైనేజీ, దాని పక్కన వాటర్ పైపులైను, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. అందువలన ఎంత విశాలంగా ఉంటే అంత మంచిదని ప్రజలు కోరుకుంటున్నారు. గృహ యజమానులు, ఆక్రమణదారులు రోడ్డు వెడల్పు కోసం స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తూ సహకరించడంతో రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. నిత్యం 10 వేల నుంచి 15 వేల మంది వరకూ ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తారు. ఒంగోలు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బీచ్‌కు వచ్చేవారి భారీగానే ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణతో వారందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

వందేళ్ల తర్వాత రోడ్డు విస్తరణ...

గతంలో ఎన్నో ప్రభుత్వాలు పరిపాలించాయి. ఎంతో మంది నాయకులు మారిపోయారు. కానీ, కొత్తపట్నం - కె.పల్లెపాలెం బీచ్ రోడ్డును పట్టించుకున్న వారు లేకుండా పోయారు. ఫలితంగా ఒంగోలు నుంచి బీచ్‌కు వచ్చేవారు, కొత్తపట్నం మండలంలోని ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. వందేళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా తక్కువ వెడల్పుతో వేసిన రోడ్డు కావడంతో ప్రస్తుతం తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎట్టకేలకు వందేళ్ల తర్వాత రోడ్డును విస్తరించి కొత్త రోడ్డు నిర్మిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తాం

ఇప్పటికే కె.పల్లెపాలెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తోంది. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించారు. రెండు రోజుల్లో కొత్తపట్నం బస్టాండ్ వద్ద రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తాం. రోడ్డుకు మార్జిన్, దాని పక్కన వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు అపోహలు పెట్టుకోకుండా రోడ్డు వేయడానికి సహకరించాలి.

– అరుణ కుమారి, ఆర్అండ్‌బీ డీఈ

ఇంత విశాలంగా రోడ్డు వేస్తారని ఊహించలేదు



మా సొంత స్కూల్‌కే బస్ డ్రైవర్‌గా వెళ్తుంటాను. కొత్తపట్నం బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యతో ఒక్కోసారి ఎంతో సమయం వృథా అవుతోంది. ఇప్పుడు ఆక్రమణలు తొలగించగానే రోడ్డు వెడల్పు అయింది. రోడ్డు వేసిన తర్వాత ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సాఫీగా వాహనాలు వెళ్తాయి. ఇంత విశాలంగా రోడ్డు వేస్తారని ఎప్పుడూ ఊహించలేదు.

– చాపల కోదండయ్య, స్కూల్ బస్ డ్రైవర్


ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి రుణపడి ఉంటా



రోడ్డు విస్తరణ కోసం నా ఇల్లు కొంత ఆక్రమణలో ఉంటే స్వచ్ఛందంగా తొలగించాను. ఎంత అవసరమైతే అంత తీసుకోమని చెప్పాను. రోడ్డు విస్తరణ వలన అనేక ఉపయోగాలున్నాయి. వ్యాపారాలు కూడా పెరుగుతాయని ఆశిస్తున్నా. రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి రుణపడి ఉంటా.

– పువ్వాడ ఉమామహేశ్వరరావు, చిరువ్యాపారి, కొత్తపట్నం

ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రోడ్డు నిర్మాణం



కొత్తపట్నంలో రోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇరుకు రోడ్డుతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గుర్తించి రోడ్డు విస్తరించి నిర్మించాలని గతంలో అనేకసార్లు ప్రయత్నం చేశాం. ప్రస్తుతం రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేయించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. రోడ్డు పూర్తి చేయడానికి ప్రజలంతా సహకరించాలి.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, ఒంగోలు

పేదల అభివృద్ధే జగనన్న ధ్యేయం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 13 కుటుంబాలు


మంత్రి సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న ఎస్టీకాలనీ వాసులు

పొన్నలూరు: రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్టీకాలనీకి చెందిన 13 కుటుంబాల వారు ఇండ్లా ప్రసాద్, శీనమ్మ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సురేష్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలతో పాటు అన్ని వర్గాల్లోని పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చి పేద ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చే ఈ రోజు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మి సుబ్బారావు, వెంకాయమ్మ, చంపట్ల చైతన్య, గంగ, ఇండ్లా రామాంజనేయులు, దుర్గ, ఇండ్లా అనీల్, రాపూరి సంజీవయ్య, అనవమ్మ, రాచగిరి సువర్ణ, పోట్లూరి శివకుమారి, మణికంఠ, రాపూరి కృపమ్మ, సురేష్, అల్లూరి శాంతి, బ్రహ్మయ్య, రాధ, మేకల దుర్గారావు, ప్రమీల, కొమరిగిరి విజయకుమార్, పోలమ్మ, జాలయ్య, దేవి కుటుంబ సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, మండల మాజీ కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మూలే కృష్ణారెడ్డి, కంటు వెంకటేశ్వర్లు, పాలూరి శ్రీనివాసులరెడ్డి, గెంటనపల్లి చంద్రశేఖర్, నూతలపాటి శివనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఆసరా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తాటిపత్రి చంద్రశేఖర్


మహిళలకు చెక్కు అందచేస్తున్న తాటిపత్రి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో వారికి పెద్ద పీట వేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక శివసదనం అతిథి గృహం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని గమనించి అధికారంలోకి రాగానే విడతల వారీగా రద్దు చేస్తానని మాట ఇచ్చారన్నారు. ఆ మాటకు కట్టుబడి అధికారంలోకి రాగానే నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల రుణాన్ని మాఫీ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 34 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 68 లక్షల మందికి పెన్షన్లు అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారన్నారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకు వేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని కొనియాడారు. అనంతరం 85 స్వయం సహాయక సంఘాలకు రూ.6.94 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, ఎల్‌సీ వెంకిరెడ్డి, స్త్రీనిధి మేనేజర్ వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అమిరెడ్డి రామిరెడ్డి, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ డి.ఖాసింవలి, ఎంపీపీ గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారిక, వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ గుమ్మా యల్లేష్, జిల్లా మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ దూదేకుల రసూల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, చంద్రకాంత్‌నాయక్, మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు జయమ్మ, మాజీ ఎంపీపీ జోగివెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఘనత జగనన్నదే


వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- వైఎస్సార్ ఆసరా పంపిణీలో మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ గతంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మహిళలను మోసం చేశాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారమే మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. సంతనూతలపాడు మండలంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 1013 గ్రూపులకు రూ.9.66 కోట్ల చెక్కును మంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా అందించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, ఏపీఎం సుధాకర్, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్నది జనరంజక పాలన

- నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ
- కలిసికట్టుగా పనిచేసి మరోసారి జగనన్నను సీఎం చేసుకుందాం


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్

పామూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జనరంజక పాలన అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక అనిల్‌గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి అధ్యక్షతన పార్టీ మండల సమావేశం, పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.2.54 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం చేయడంతో పాటు, మహిళలకు ప్రజాప్రతినిధులుగా, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు. పశ్చిమ ప్రాంత వరప్రసాదిని వెలిగొండ ప్రాజెక్ట్ రెండు టన్నెల్ పూర్తయిందని, త్వరలో ప్రాజెక్టును జాతికి అంకితం చేసి పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తారన్నారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్‌కు వెలిగొండ నీటిని ఇచ్చి మండలాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారన్నారు.

ఎన్ని పార్టీలు కలిసినా విజయం వైఎస్సార్ సీపీదే

చంద్రబాబు సైకిల్‌ను పవన్ నెడుతున్నారని, ఎన్ని పార్టీలు కలిసొచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందితేనే ఓటు వేయండని చెబుతున్న దమ్మున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో లబ్ధి పొందితేనే ఓటు వేయాలని అడిగే ధైర్యం, దమ్ము టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ నెల రోజులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోసారి కనిగిరిపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం దద్దాల నారాయణను నాయకులు ఘనంగా సన్మానించారు. తొలుత బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, అంబటి కొండారెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎం అనంతరెడ్డి, జెడ్పీటీసీలు కనిగిరి యం.కస్తూరిరెడ్డి, వెలిగండ్ల గుంటక తిరుపతిరెడ్డి, రామన తిరుపతిరెడ్డి, గాయం బలరామిరెడ్డి, ఓకే రెడ్డి, మెడబలిమి గురవయ్య, మాదిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఏసురత్నం, కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట



ఐఎంఏ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ

ఒంగోలు టౌన్: ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, మానసిక ఆందోళన నుంచి బయట పడడం ద్వారా క్యాన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయవచ్చని హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రమణారెడ్డి సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజెన్స్, జేసీఐ అల్యూమినియం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రంగరాయుడి చెరువు కట్టపై ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద క్యాన్సర్ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రబలడానికి అనేక కారణాలు ఉన్నాయని, అందులో దురలవాట్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. పొగతాగడం, గుట్కాలు నమలడం, పొగాకు లాంటివి క్యాన్సర్‌కు కారణం అవుతున్నాయని చెప్పారు. మనదేశంలో ఏటా 20వేల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా వారిలో 10వేల మందికి పైగా మృత్యువాత పడుతున్నారని తెలిపారు. నోటి క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అనేక మంది ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకునే వీలుంటుందన్నారు. అయితే క్యాన్సర్ వ్యాధి వచ్చిందని తెలియగానే చాలా మంది ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారని, దీనివల్ల మరింత నష్టం జరుగుతుందన్నారు. క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలని, అప్పుడే ఆ మహమ్మారి నుంచి బయటపడవచ్చన్నారు. రానున్న రోజుల్లో కాలేజీలు, పాఠశాలలో క్యాన్సర్‌పై అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు డాక్టర్ ఆర్‌వి రఘునందన్, డాక్టర్ అమర్నాథ్ తెలిపారు. సదస్సులో 300 మందికి పైగా పాల్గొన్నారు. జేసీఐ చైర్మన్ పి.నందన్‌కుమార్, కె.వరుణ్‌కుమార్, లయన్స్ క్లబ్‌కు చెందిన శ్రీరాములురెడ్డి, నోబుల్ చరియన్, అడపాల వెంకటేశ్వర్లు, నైనాల రామకృష్ణ, చిట్టెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోసూరి శ్రీదేవి, తిరుపతి రెడ్డి, సూరే ఏడుకొండలు, మంగళగిరి నరసింహరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. అర్జున్ ఇన్‌ఫ్రా సౌజన్యంలో చర్చి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రొమ్ము క్యాన్సర్ ఎక్కువగా ప్రబలుతున్న కారణంగా మహిళలు ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎలాంటి క్యాన్సర్‌ను అయినా సరే తొలి దశలో గుర్తిస్తే నయం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని ప్రజలను కోరారు. ఐఎంఏ వైద్యులు శ్రావణి, శ్రీదేవి, దీప, మాధవి, అనుశ్రీ, జాలాది మణిబాబు, తిరుమలరావు, కోటిరెడ్డి, మన్నే వీరయ్య చౌదరి, రఘునందన్, రంగనాథ్, నాగయ్య నాయుడు, మెడికోలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగులపై రాళ్ల దాడి


గాయపడిన సురేంద్ర

గిద్దలూరు రూరల్: అక్రమంగా అటవీ సంపద తరలిస్తుండగా అడ్డుకున్నందుకు అటవీశాఖ ఉద్యోగులపై రాళ్లతో దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని దిగువమెట్ట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. నంద్యాల నుంచి గుంటూరు వైపు వెళ్లే రైలులో కొందరు అక్రమంగా వెదురు బొంగులు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని అటవీశాఖ సిబ్బంది సమాచారం అందుకుని వాటిని అడ్డుకున్నారు. అక్రమ రవాణాదారులు రాళ్లతో అటవీశాఖ ఉద్యోగులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ట్రైబల్ వాచర్ సురేంద్రకు గాయాలయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తాళాలు వేసిన గృహాల్లో చోరీ

మార్కాపురం: తాళాలు వేసిన గృహాలను టార్గెట్ చేసుకుని దొంగలు రెచ్చిపోయారు. మార్కాపురం పట్టణంలోని శివాజీనగర్ 5, 6 లైన్లలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి తాళాలు పగులకొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. శివాజీనగర్ 6వ లైన్‌లో నివాసముంటున్న కాకర్ల వెంకటేశ్వర్లు బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ రిటైరయ్యారు. ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి రూ.50 వేల నగదు, బీరువాలో ఉన్న మూడున్నర తులాల నల్లల దండ, ఒకటిన్నర తులం నెక్లెస్, ఒకటిన్నర తులం ఉంగరం, కమ్మలు, వెండి వస్తువులు, దుస్తులు చోరీకి గురైనట్లు గుర్తించారు. అదే లైన్లో నివాసముండే రిటైర్డు టీచర్ చిన్న వీరాచారి, 5వ లైన్‌లో నివాసముండే తాళ్లపల్లి శివరామకృష్ణ, జక్కి ఆదినారాయణ ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లో ఉన్న బంగారు, వెండి సామాను, దుస్తులు తీసుకెళ్లినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై రెహమాన్, క్లూస్ టీం ఆధారాలు సేకరించారు.

గ్రానైట్ ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు


బోల్తాపడిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న సీఐ

చీమకుర్తి: గ్రానైట్ వేస్ట్ రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చీమకుర్తి–సంతనూతలపాడు మధ్య కర్నూలు రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన బీహార్‌కు చెందిన ఔదేష్ సహాని అనే వ్యక్తి ఒంగోలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాక్టర్ నడిపే డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. చీమకుర్తి నుంచి పేర్నమిట్ట ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల వద్దకు గ్రానైట్ వేస్ట్ రాళ్లను తీసుకెళ్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డొంక్‌లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న ఔదేష్ సహానికి గ్రానైట్ రాళ్లు బలంగా గుచ్చుకోవడం వలన తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చీమకుర్తి సీఐ యూ దుర్గాప్రసాద్ తెలిపారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో ఒంగోలు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేస్తున్నారు. మిగిలిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు సీఐ తెలిపారు.